సాక్షి పెద్దపల్లి

బుధవారం । 18 । జూన్ । 2025



ఆటాపాటలతో బోధన

రామగుండం: ముర్మూర్ మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా సంక్షేమాధికారి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో పోషణవాటిక, పోషకాహారం కార్యక్రమం నిర్వహించారు.



నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

సుల్తానాబాద్: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఏవో ఆదిరెడ్డి హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు.

గరిష్టం/కనిష్టం
34.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. పగలు ఉక్కపోతగా, అసౌకర్యంగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చెట్లకు లెక్కుంది



చెట్టుకు నంబర్ వేస్తున్న ఫారెస్టు సిబ్బంది

జ్యోతినగర్(రామగుండం): హైదరాబాద్‌కు చెందిన అటవీ శాఖ అధికారి సాగర్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీలో మంగళవారం చెట్ల లెక్కింపు ప్రారంభించారు. ఎన్టీపీసీ ప్రాజెక్టు ఈఎంజీ విభాగం నేతృత్వం వహించారు. ప్రాజెక్టు, టీటీఎస్, పీటీఎస్, సీఐఎస్‌ఎఫ్ బ్యారక్స్ తదితర ప్రాంతాల్లో ఎన్టీపీసీ సహకారంతో చెట్ల సంఖ్య లెక్కిస్తున్నట్లు సాగర్ తెలిపారు. కొత్త ప్రాజెక్టు రాకతో టీటీఎస్‌ను తొలగిస్తారని, ఈ క్రమంలో చెట్ల వివరాలను నమోదు చేసి, వాటి స్థానంలో ఇతర ప్రాంతాల్లో కొత్తగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. సుమారు 60 వేల చెట్ల వరకు బ్యాడ్జీలను వేస్తామని ఆయన తెలిపారు.

వైద్య, ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీకి చర్యలు

పెద్దపల్లిరూరల్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి మంగళవారం తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలల్లో పనిచేసేందుకు వైద్యాధికారి 08 పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి, అర్హతగలవారు జిల్లా వెబ్‌సైట్ www.peddapalli.telangana.gov.in లో తమ వివరాలు నమోదు చేయాలని ఆమె సూచించారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు

గోదావరిఖనిటౌన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025–26 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో ప్రవేశాలకోసం ఆగస్టు 13వ తేదీ వరకు గడువు ఉందని స్థానిక అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ జి.సుబ్బారావు, ప్రిన్సిపాల్ జైకిషన్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్లు, ట్యూషన్ ఫీజును ఆగస్టు 13 వరకు చెల్లించాలన్నారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, డిప్లొమా, 10+2 ఉత్తీర్ణులైనవారు నేరుగా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఆన్‌లైన్, మీ సేవా కేంద్రాల్లో ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు www.braouonline వెబ్‌సైట్ లేదా 73829 29655 ఫోన్ నంబరులో సంప్రదించాలని వారు కోరారు.

యోగా సాధన చేయాలి



యోగా సాధనలో అధికారులు, సిబ్బంది

పెద్దపల్లిరూరల్: యోగా సాధన ద్వారా ఆరోగ్యంగా ఉంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి అన్న ప్రసన్నకుమారి అన్నారు. అంతర్జాతీయ యోగా శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో యోగా సాధనపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆయుర్వేద విభాగం ద్వారా ఈ కార్యక్రమం చేపట్టారు. శారీరక శ్రమ లేక రక్తపోటు, మధుమేహం, ఒబెసిటీ లాంటి వాటి బారినపడుతున్నారని ఆమె అన్నారు. జీవనశైలి మార్చుకొని, ప్రతీరోజూ యోగా సాధన చేయాలని ఆమె సూచించారు. ప్రోగ్రాం అధికారులు వాణిశ్రీ, శ్రీరాములు, కిరణ్, ఆయుష్ జిల్లా ఇన్‌చార్జి అరుణ, డీపీఎంవో విద్యాసాగర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి




మాట్లాడుతున్న కాళిందిని

పెద్దపల్లిరూరల్: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి(డీఆర్డీవో) కాళిందిని కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం స్వశక్తి మహిళా సంఘాలకు ర్యాంప్ ప్రాజెక్టుపై నిర్వహించిన ఒకరోజు అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. స్కూల్ యూనిఫామ్స్‌ను నాణ్యతతో కుట్టేందుకు ఒక్కో మహిళా సంఘం సభ్యురాలిపై రోజూ రూ.200 ఖర్చు చేస్తూ, 10 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని అన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయించి శాశ్వతంగా కుట్టుపని ఉండేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈనెల 20 నుంచి రాఖీల తయారీపై కూడా శిక్షణ ఇస్తామని, తద్వారా మంచి వ్యాపార అవకాశాలు ఉంటాయని ఆమె వివరించారు.

అప్రమత్తతే ఆయుధం

- వానాకాలం.. జర పైలం • విద్యుత్‌తో జాగ్రత్త.. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం
- ఎలక్ట్రీషియన్లతోనే కరెంట్ సమస్య పరిష్కరించుకోవాలి
- టోల్‌ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేసినా వెంటనే సేవలు అందిస్తారు
- ప్రతీ సోమవారం ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేయవచ్చు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మాధవరావు



సాక్షి, పెద్దపల్లి: విద్యుత్‌ను సరిగ్గా వినియోగిస్తే ఎంత ఉపయోగమో.. ఏమరుపాటుగా ఉంటే అంతే ప్రమాదకరం. జాగ్రత్తలు పాటిస్తూ, అప్రమత్తతతో ఉంటే ప్రమాదాల నుంచి బయటపడొచ్చని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మాధవరావు అన్నారు. భద్రతా చర్యలు లేకనే వ్యవసాయ మోటార్లు, పొలాలకు రక్షణగా ఉంచిన విద్యుత్ తీగలు తాకి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు, మెలకువలతో ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని అంటున్నారు. బట్టలు ఆరవేసేందుకు ఇనుప తీగలకు బదులు నైలాన్ తాళ్లు ఉపయోగించాలని, ఇళ్లలో ఐఎస్ఐ నాణ్యత కలిగిన విద్యుత్ పరికరాలు వినియోగించాలని సూచిస్తున్నారు. కరెంట్ వైర్లకు ఇన్సూలేషన్(పైపొర) దెబ్బతిన్నట్లు గుర్తిస్తే తక్షణమే ఎలక్ట్రీషియన్‌తో మరమ్మతు చేయించాలని వెల్లడించారు. 'సాక్షి' ఇంటర్వ్యూలో ఇంకా అనేక సూచనలు చేశారు.

☛ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు సూచనలు ఏంటి?

ఎస్ఈ: సర్వీస్ లైన్‌కు జాయింట్లు లేకుండా చూసుకోవాలి. ఇంటి వైరింగ్‌కు ఎర్తింగ్ ఉండాలి. చేతులు తడిగా ఉంటే స్విచ్‌లు తాకొద్దు. వర్షాలతో స్తంభాలకు ఉన్న ఇనుపరాడ్లు తడిచి ఇండెక్షన్ వచ్చే అవకాశం ఉంది. గాలికి తీగలు తెగి ఇళ్ల సర్వీసు వైర్లు కూడా దెబ్బతింటాయి. ఇలాంటి సందర్భాల్లో తడి ఇంటికి ఇండెక్షన్ వచ్చి విద్యుత్ సరఫరా అవుతుంది. తీగలను సరిచేసుకోవాలి. అధికారులను సంప్రదిస్తే వెంటనే సమస్య పరిష్కరిస్తారు.

☛ విద్యుత్ ప్రమాదానికి గురైతే ఏం చేయాలి?

ఎస్ఈ: వెంటనే మెయిన్ స్విచ్‌ఆఫ్ చేయాలి. పొడి కర్ర, లేదా విద్యుత్ నిరోధక ప్లాస్టిక్ వస్తువులతో బాధితులను తప్పించాలి. తక్షణమే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించాలి. విద్యుత్ తీగలు తెగిపడ్డా, వేలాడుతున్నా సమీప అధికారులకు సమాచారం ఇవ్వాలి. లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేయాలి.

☛ పిడుగులు, ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఎస్ఈ: మెరుపు కనిపించిన 30 సెకన్లలోపు ఉరుము వినిపిస్తే పిడుగు ప్రమాదం ఉందని అర్థం. ఆ సమయంలో చెట్లకింద, ఎత్తయిన స్థలాలు, కారు, లోహపు వస్తువుల వద్ద ఉండొద్దు. ఉపరితల నేలపై గుండెకు కాళ్లు తాకేలా (దగ్గరగా) ఉంచి, తలవంచి కూర్చోవాలి.

☛ వ్యవసాయ భూముల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి?

ఎస్ఈ: అధికారుల అనుమతి లేకుండా మరమ్మతులు చేపట్టవద్దు. సిబ్బంది లేకుండా ఫ్యూజులు వేయడం, తీగలకు కనెక్షన్ ఇవ్వరాదు. వేలాడే తీగలను గుర్తించి సవరించాం. ఇంకా ఎక్కడైనా ఉంటే ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలి. లేదా స్థానిక ఏఈకి సమాచారం ఇచ్చినా వెంటనే పరిష్కరిస్తారు. రైతులు స్టార్టర్లను ఇనుప డబ్బాల్లో కాకుండా ప్లాస్టిక్ డబ్బాల్లో అమర్చాలి. జిల్లావ్యాప్తంగా 200 కంచెలు లేనిట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించాం. ఎత్తయిన గద్దెలపై వాటిని ఏర్పాటు చేస్తాం.

☛ విద్యుత్ ప్రజావాణికి స్పందన ఎలా ఉంది?

ఎస్ఈ: ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు ఈయేడాదిలో 495 ఫిర్యాదులు వచ్చాయి. అందులో 477 పరిష్కరించాం. ఇందులో అధికంగా గృహజ్యోతి ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై ప్రజలకు అవగాహన లేక ఫిర్యాదు చేయడం లేదు.

☛ విద్యుత్ ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారం పెండింగ్‌లో ఉందా?

ఎస్ఈ: జిల్లాలో గతేడాది 47 ప్రమాదాలకు రూ.1.04కోట్లు పరిహారం అందించాం. అందులో 19మందికి రూ.95లక్షలు, 28 మూగజీవాలకు రూ.9 లక్షలు అందజేశాం. విద్యుత్ ప్రమాదంలో మనిషి మరణిస్తే రూ.5లక్షలు, పశువులకు రూ.40వేలు పరిహారం ఇస్తాం.

☛ గృహజ్యోతి పథకం అమలు ఎలా ఉంది?

ఎస్ఈ: జిల్లాలో గృహ వినియోగదారులు 2.14లక్షల మంది ఉండగా, అందులో 1,29,139మంది ఉచిత విద్యుత్ వినియోగిస్తున్నారు. వీరికి నెలకు సుమారు రూ.3కోట్ల రాయితీని ప్రభుత్వం వర్తింపజేస్తోంది.

☛ విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారా?

ఎస్ఈ: వాల్‌పోస్టర్లు, సోషల్ మీడియా, పత్రికల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం. మా సిబ్బంది సైతం రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అయినా, కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. విద్యుత్ విషయంలో నిర్లక్ష్యం వద్దు.

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- వివిధ దశల్లో ఇళ్ల పనులు
- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో తొలిదశ నగదు జమ



రొంపికుంటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు, లబ్ధిదారులు

కమాన్‌పూర్(మంథని): మంథని డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికచేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. ఈ ఏడాది జనవరి 26న ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించింది. తొలుత మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేసింది. అర్హులను ఎంపికచేసి ప్రొసీడింగ్స్ అందజేసింది. ఒక్కో ఇంటిని 400చ.అ. నుంచి 600 చ.అ. విస్తీర్ణంలో నిర్మించాలని నిబంధన విధించింది. ఈ మేరకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున చెల్లిస్తామని వెల్లడించింది. దీంతో మంథని డివిజన్‌లో నాలుగు గ్రామాలను ఎంపికచేసిన అధికారులు.. 802 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. మంథని మండలం అడవిసోమన్‌పల్లి, రామగిరి మండలం రత్నాపూర్, ముత్తారం మండలం మచ్చుపేట, కమాన్‌పూర్ మండలం రొంపికుంటలో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టుల్లో పనులు చకచకా సాగుతున్నాయి. అడవిసోమన్‌పల్లిలో 228 మందిని ఎంపిక చేయగా.. 162 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. 152 మందికి బిల్లులు మంజూరవగా వారి బ్యాంకు ఖాతాల్లో అధికారులు డబ్బు జమచేశారు. రత్నాపూర్‌లో 329 మందిని ఎంపిక చేయగా 45 ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. 41 మందికి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమచేశారు. రొంపికుంటలో 206 మందిని ఎంపిక చేయగా 47 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 43 మందికి బిల్లులు విడుదలయ్యాయి. మచ్చుపేటలో 39 మందిని లబ్ధిదారులను ఎంపిక చేయగా 15 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. 12 మందికి బిల్లులు మంజూరైనట్లు డీఈ తెలిపారు.

స్థానిక సమరానికి సన్నద్ధం కావాలి

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో అవగాహన పెంచాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని: గత బీఆర్ఎస్ రజతోత్సవ సభ సక్సెస్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతీకార్యకర్త స్థానిక సమరానికి సిద్ధం కావాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు కోరారు. పట్టణంలోని రాజగృహలో మంథని నియోజకవర్గంలోని ఆయా మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలో ఆయన మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ, వచ్చే నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే 17 నెలల కాంగ్రెస్ పాలనలో ఆ ప్రభుత్వం అవలంబించిన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలాయన సూచించారు. హామీలను నెరవేర్చకపోగా ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందనే విషయాన్ని అర్థం చేయించాలని ఆయన అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలపై ప్రజలకు అవగాహన పెంచాలని కోరారు. అనంతరం మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రస్థానం బుక్‌ను ఆయన ఆవిష్కరించారు.

కోతెంత.. జమెంత?

- అందని సీఎంపీఎఫ్ చిట్టీలు
- సమాచారం తెలియక ఆందోళన
- ఇప్పటికీ అందని ఆస్పత్రి బుక్కులు
- గుర్తింపు కార్డులకూ దిక్కులేదు
- ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల వేదన



గోదావరిఖని: సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు కొంతకాలంగా సింగరేణి కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్) చిట్టీలు అందడం లేదు. దీంతో తమ వేతనాల్లోంచి కోత విధిస్తున్న పీఎఫ్ సొమ్ము వివరాలు తెలియక గార్డులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాదు.. ప్రతినెలా సీఎంపీఎఫ్‌లో జమచేస్తున్న లెక్కలు తెలుసుకునేందుకు యత్నించినా సామాచారం ఇచ్చేవారే కరువయ్యారని సింగరేణిలోని కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డులు ఆవేదన చెందుతున్నారు.


సర్వత్రా ఆందోళన..

కాంట్రాక్టర్లు తమ వేతనాల్లో సీఎంపీఎఫ్ కోసం ఎంత కోత విధిస్తున్నారు? తమ ఖాతాలో ఎంత సొమ్ము జమచేస్తున్నారు? అనే విషయం తెలియక సెక్యూరిటీగార్డులు ఆందోళన చెందుతున్నారు. ఆర్జీ–2 ఏరియాలో కాంట్రాక్టు పొందిన పర్ఫెక్ట్ సెక్యూరిటీ సర్వీస్ ద్వారా 90 మందిని సెక్యూరిటీ గార్డులుగా నియమించుకుంది. వివిధ విభాగాల్లో రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డుల విషయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. టెండర్ పొంది ఏడాది గడిచినా ఐడెంటీకార్డులు కూడా ఇవ్వలేదు. అత్యవసర పరిస్థితుల్లో సింగరేణి ఆస్పత్రిలో వైద్యం పొందేందుకు ఆస్పత్రి బుక్కులు కూడా మంజూరు చేయలేదు. ఫలితంగా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు.

వేతనాలపై క్లారిటీ ఏది?

ప్రతినెలా అందాల్సి పే స్లిప్పులు అందకపోవడంతో తమ వేతనాలు ఎంత అనే విషయంపై సెక్యూరిటీ గార్డులకు క్లారిటీ ఉండటం లేదు. వర్షాకాలంలో రెయిన్‌కోట్‌లు, ఆరుబయట దొంగల కోసం కాపలా ఉండే వారికి రాత్రిపూట దారి కనిపించేలా టార్చిలైట్లు ఇప్పటికీ ఇవ్వడంలేదు. ఈవిషయంలో యాజమాన్యం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని సెక్యూరిటీ గార్డులు విమర్శిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



టెండర్ పొందిన కాంట్రాక్టర్ ద్వారా సెక్యూరిటీ గార్డులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందించేలా చర్యలు తీసుకుంటాం. సీఎంపీఎఫ్ చిట్టీలు, ఆస్పత్రి పుస్తకాలు, ఐడీకార్డుల విషయం నా దృష్టికి రాలేదు. కాంట్రాక్టర్ జాప్యం చేయడం సరికాదు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– బి.వెంకటయ్య, జీఎం, ఆర్జీ–2

ఆశల విహంగం



- అంతర్గాంలో ఎయిర్‌పోర్ట్!
- మొగ్గుచూపిన ఏఏఐ
- అందుబాటులో వందలాది ఎకరాల్లో ప్రభుత్వ స్థలాలు
- సాధ్యాసాధ్యాలపై నెలరోజుల్లో నిర్ణయం

రామగుండం: అంతర్గాం ప్రాంతం విమానాశ్రయానికి కేంద్రబిందువుగా మారుతుందా? మంచిర్యాల, పెద్దపల్లి జిల్లావాసులకు విమాన ప్రయాణం అందుబాటులోకి వస్తుందా? ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) తీసుకుంటున్న చర్యలు అంతర్గాంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు అనుకూలంగానే ఉంటున్నాయని తెలుస్తోంది. ఇందుకు అనేక అనుకూలాంశాలు ఉన్నట్లు ఏఏఐ అధికారులు ఇప్పటికే గుర్తించారు.

1980కి ముందే ఎయిర్‌పోర్టు..

రామగుండం సమీపంలోని బసంత్‌నగర్‌లో 1980 కన్నా ముందే ఓ ప్రఖ్యాత సిమెంట్ కర్మాగారం ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేసింది. తాజాగా, ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకున్న ఏఏఐ.. బసంత్‌నగర్‌లో విమానాశ్రయం ఏర్పాటు సాధ్యం కాదని తేల్చింది. ఇదేసమయంలో అంతర్గాంలో విమానాశ్రయం ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించింది. దీంతో జిల్లావాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.


అందుబాటులో ప్రభుత్వ భూములు..

ఉమ్మడి మండలంలోని పలు గ్రామాలతో కలిసి ఉన్న రామగుండంలో అప్పటి నిజాం ప్రభుత్వం 1946లో ఏ– థర్మల్ విద్యుత్ కేంద్రం ఉండేది. దానికి అనుబంధంగా రాయదండి, అంతర్గాం, గోలివాడ శివారుల్లో అజామాబాద్ ఇండస్ట్రియల్ సిటీ ఏర్పాటు కోసం నామమాత్రపు ధరతో 3,696.32 ఎకరాల వ్యవసాయ భూములను రైతుల నుంచి సేకరించింది. సాంకేతిక కారణాలతో ఇండస్ట్రియల్ సిటీ ఏర్పాటు కాలేదు. అయితే, ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు సేకరించిన ఆ భూములు అభివృద్ధికి నోచుకోలేదు. వాటిని కుర్జుకమ్మి భూములుగా పరిగణించనున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇలాంటి భూములు రాయదండి(అంతర్గాం) గ్రామ శివారులో 1,165.18 ఎకరాలు ఉన్నాయి. అందులో 147.14 ఎకరాలు ప్రతిపాదిత బీపీఎల్ విద్యుత్ కేంద్రానికి అప్పగించారు. విమానాశ్రయం ఏర్పాటుకు కుర్జుకమ్మితోపాటు బీపీఎల్, టెక్స్‌టైల్ భూములు అనుకూలంగా ఉన్నాయి.

అంతర్గాంలోనే అనుకూలం..

అంతర్గాంలోని ప్రభుత్వ స్థలాల్లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనుకూలాంశాలు ఉన్నాయని ఏఏఐ ఇప్పటికే సూచనప్రాయంగా వెల్లడించింది. ప్రభుత్వ భూములభ్యత, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల కనెక్టివిటీ, అతిసమీపంలోనే రైలు, రాజీవ్ రహదారి, ప్రశాంతమైన గోదావరినదీ తీర మైదాన ప్రాంతం ఉండడం విమానాశ్రయానికి కలిసొచ్చే అంశాలు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో దేశంలోని అన్ని రాష్ట్రాల ఉన్నత ఉద్యోగులు, కూలీలు ఉండడం కూడా వైమానిక రంగానికి లాభాలు తెచ్చిపెడుతుందని భావిస్తున్నారు.


విమాన సేవలు అత్యవసరం



ప్రస్తుతం సుదూర ప్రాంతాలకు వెళ్లిరావడం కోసం అధిక సమయం వెచ్చించాల్సి వస్తున్నది. ఆర్థికపరిస్థితి కూడా కాస్త మెరుగుపడింది. దీంతో విమాన ప్రయాణం చేయాలనే కల సాకారం చేసుకునేందుకు అంతర్గాంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ఉపయోగపడుతుంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతం నుంచి దేశ, విదేశాలకు రాకపోకలు సాగించేవారు అనేకమంది ఉన్నారు. అంతేకాదు.. ఢిల్లీ, కన్యాకుమారి వెళ్లాలన్నా హైదరాబాద్‌లో విమానం ఎక్కాల్సి వస్తోంది. అంతర్గాంలోనే ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తే ఇక్కడి నుంచే ఎక్కడికైనా సులభంగా వెళ్లవచ్చు. సమయం ఆదా అవుతుంది.

– అబ్దుల్ తఖీ, జెన్‌కో ఉద్యోగి, రామగుండం

సమాచారం లేదు



అంతర్గాంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తారనే సమాచారం మాకు ఇంకా అందలేదు. నేను కూడా దిన పత్రికల్లో చదివాను. అంతేతప్ప అధికారింగా మాకు సమాచారం రాలేదు. మండలంలో అందుబాటులో ఉన్న భూముల వివరాల సమాచారమే ఉంటుంది. ఆ సమాచారం అడిగితే నివేదిక అందజేస్తాం.

– రవీందర్‌పటేల్, తహసీల్దార్, అంతర్గాం

కోవిడ్ దెబ్బకు సిరిసిల్ల విలవిల!

- 2021లో జననాల కన్నా మరణాలు అధికం
- ఆ మరణాల్లో పురుషులే ఎక్కువ
- మృతులంతా 65 ఏళ్ల నుంచి 69 ఏళ్ల వారే
- ఐరాస 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్' డేటాలో వెల్లడి
- 2022లో మళ్లీ పుంజుకున్న జననాలు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ప్రపంచదేశాలను గడగడలాడించిన కోవిడ్ మహమ్మారి మిగిల్చిన విషాదాలు అన్నీఇన్నీ కావు. ప్రజలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నిలువుదోపిడీ చేసి వేలాది మందిని బలితీసుకున్న ఆ వైరస్ వదలిన ఆనవాళ్లు ఇప్పట్లో చెరిగేలా లేవు. తాజాగా ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన పాపులేషన్ రిపోర్ట్ సమర్పించిన 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్' (సీఆర్ఎస్) డేటా పలు ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఈ డేటా ప్రకారం.. దేశంలో జననాల కన్నా అత్యధిక మరణాలు చోటుచేసుకున్న 49 జిల్లాల్లో సిరిసిల్ల జిల్లా కూడా ఒకటి. కోవిడ్ అనంతరం ప్రజల ఆరోగ్యాలు, జీవనశైలిలో మార్పులు రావడం, సెకండ్ వేవ్ తీవ్రంగా విజృంభించడంతో ఆ ఏడాది మరణాలు అధికంగా సంభవించాయి.

సీఆర్ఎస్ డేటా ప్రకారం..

2021లో నమోదైన జనన మరణాలను పరిశీలిస్తే, 5,130 మరణాలకు 5,028 జననాలు చోటు చేసుకున్నాయి. ఆ మరణాలు కేవలం సిరిసిల్ల జిల్లాకు మాత్రమే పరిమితం కాలేదు. ఆ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 2,34,425 మరణాలు రికార్డయ్యాయి. అందులో 1,35,725 మంది పురుషులు కాగా, 98,700 మంది మహిళలు ఉన్నారు. ఈ గణాంకాల ప్రకారం.. మహిళల కన్నా పురుషులు 40శాతం మంది అధికంగా మరణించారు. ఆ ఏడాది చోటు చేసుకున్న మరణాల్లో పట్టణ ప్రాంతాల్లో 61,553 పురుషులు, 46,674 మంది మహిళలు మరణించగా.. అదే సమయంలో గ్రామీణ ప్రాంతంలో 1,06,327 మరణాలు సంభవించాయి.

పురుషుల్లోనే మరణాలు అధికం

డేటా ప్రకారం 65 నుంచి 69 ఏళ్ల వయసు వారిలో మరణాల రేటు అధికంగా ఉంది. ఈ వయసులో ఉన్నవారిలో 85,945 మరణాలు రికార్డయ్యాయి. ఇక 70 ఏళ్ల పైబడిన వారిలో 51,516 మరణాలు నమోదయ్యాయి. 55 నుంచి 64 ఏళ్ల 42,349 మంది మరణాలు, 45– 54 వయసు గ్రూపులో 12,184 మరణాలు చోటు చేసుకున్నాయి. ఈ స్థాయిలో మరణాలు చోటుచేసుకోవడానికి కోవిడ్ ప్రధాన కారణమని నిపుణులు భావిస్తున్నారు. అదే సమయంలో జీవన విధానంలో మార్పులు, బీపీ, హైపర్ టెన్షన్, గుండె సంబంధిత వ్యాధులు కూడా వీరి మరణాలకు కారణమై ఉంటాయని అంచనా వేస్తున్నారు. తెలంగాణ మరణాల రికార్డులో ముందంజలో ఉంది. 75 శాతం మేరకు మరణాలు అప్పటికప్పుడే రిపోర్టు అవుతున్నాయి. మిగిలినవి తరువాత రిపోర్టు అవుతున్నాయి. సీఆర్ఎస్ డేటా ప్రకారం .. 2022లో రాజన్న సిరిసిల్లలో 3220 మరణాలు నమోదవగా, 7647 జననాలు నమోదయ్యాయి. ఏడాది తరువాత కోవిడ్ ప్రభావం తగ్గిపోవడంతో మరణాలు కూడా తగ్గుముఖం పట్టి ఉంటాయని భావిస్తున్నారు.

క్లుప్తంగా

అల్ఫోర్స్ ఇ- టెక్నో విద్యార్థినికి గిన్నీస్‌బుక్‌లో చోటు


దీత్యను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న బుక్క దీత్య 'గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సాధించినట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో సుమారు 2,400 మందికి పైగా కళాకారులతో కలిసి పాల్గొని ప్రతిష్ఠాత్మక గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కైవసం చేసుకోవడం చారిత్రాత్మక విజయమన్నారు. విద్యార్థినిని మంగళవారం స్థానిక పాఠశాలలో ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

అపోలో రీచ్‌లో నూతనంగా గ్యాస్ట్రో, లివర్ చికిత్సలు


నూతన విభాగాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: నగరంలోని అపోలో రీచ్ హాస్పిటల్‌లో నూతనంగా గ్యాస్ట్రోఎంటరాలజీ, లివర్ డిసీజ్ విభాగం ఏర్పాటు చేసినట్లు ఏవో డాక్టర్ నాగసతీశ్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ డాక్టర్ పరమేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన గ్యాస్ట్రో ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించారు. అత్యాధునిక ఎండోస్కోపీ పరికరాలతో జీర్ణ, ప్రేగు, లివర్ సంబంధిత రోగాలకు సమగ్ర చికిత్సలను అందించనున్నట్లు తెలిపారు.

ఇజ్రాయిల్‌లో జగిత్యాల వాసి మృతి


రవిగౌడ్ (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని 36వ వార్డుకు చెందిన రేవెల్ల రవిగౌడ్ (45) ఇటీవల ఇజ్రాయిల్ దేశంలో గుండెపోటుతో మరణించాడు. మంగళవారం జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి రవిగౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇజ్రాయిల్ దేశంలో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు జాప్యం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డితో మాట్లాడి మృతదేహాన్ని స్వదేశానికి తెప్పిస్తామని హామీ ఇచ్చారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు..


బల్లగిరి (ఫైల్)

జగిత్యాలక్రైం(సారంగాపూర్): సారంగాపూర్ మండలం పోతారంలో కొత్త ఇంట్లో వైరింగ్ చేస్తుండగా నారపాక బల్లగిరి (25) విద్యుత్‌షాక్ తగిలి మృతిచెందాడు. బీర్‌పూర్ మండలం ఇందిరనగర్‌కు చెందిన నారపాక బల్లగిరి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం సారంగాపూర్ మండలం పోతారానికి చెందిన బైరి రమేశ్ ఇంట్లో విద్యుత్ వైరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సారంగాపూర్ ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బండమీది బడి.. చదువుల ఒడి

- ఈ బడిలో చదివి ఉన్నతస్థానాల్లో నిలిచిన పలువురు
- ఎంతో మందికి ఉజ్వల భవిష్యత్తు ఇచ్చిన రుద్రంగి పాఠశాల



బండమీది బడిగా ప్రసిద్ధిగాంచిన రుద్రంగి జెడ్పీ హైస్కూల్

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రంలోని బండమీది బడిగా ప్రఖ్యాతి పొందిన రుద్రంగి జెడ్పీ హైస్కూల్‌కు బహుచరిత్ర ఉంది. సుమారు 70 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు చదువుకొని ఉజ్వల భవిష్యత్తును పొందారు. ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తూ బండమీది బడి చదువుల ఒడిగా విలసిల్లుతుంది. ప్రస్తుత ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బండమీది బడిలోనే హైస్కూల్ విద్యను అభ్యసించారు. అలాగే ప్రస్తుతం వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న రుద్రంగి మండల కేంద్రానికి చెందిన అంబటి నర్సయ్య, హైకోర్టు జడ్జిగా చేసి రిటైర్డ్ అయిన రుద్రంగికి చెందిన ఓలిమినేని నిరంజన్‌రావు ఈ బడిలో విద్యను అభ్యసించినవారే.

ఉన్నత స్థానాల్లో మరికొందరు..

హన్మాజీపేట గ్రామానికి చెందిన గడ్డం జలపతిరెడ్డి రాష్ట్ర ఎస్‌టీవోగా చేసి రిటైర్డ్ అయ్యారు. రుద్రంగికి చెందిన మర్రిపల్లి చందన చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ మెంబర్‌గా ప్రస్తుతం హైదరాబాద్‌లో చేస్తున్నారు. దేశవేని శంకర్ ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్‌గా చేస్తుండగా, రుద్రంగికి చెందిన కత్తి మల్లయ్య ఆడిటర్‌గా పనిచేశారు. చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన ఉప్పులూటి గోవిందరావు అసిస్టెంట్ ఇంజినీర్‌గా, చందుర్తి మండల కేంద్రనికి చెందిన దామోదర్ వరంగల్‌లో ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యారు. రుద్రంగికి చెందిన ఆకుల రవి ఇటీవల స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. వెంకటేశం బ్యాంకు మేనేజర్‌గా చేసి ఉద్యోగ విరమణ పొందారు. రుద్రంగికి చెందిన మర్రిపల్లి చక్రవర్తి సేఫ్టీ కన్సల్టెంట్‌గా చేస్తున్నారు. ఇంకా ఎంతో మంది రుద్రంగి జెడ్పీ హైస్కూల్‌లో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో ఉన్నారు.

రుద్రంగి హైస్కూల్ విద్యార్థి ప్రభుత్వ విప్‌గా..


ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వగ్రామం రుద్రంగి. రుద్రంగి బండ మీది బడిలోనే తన హైస్కూల్ విద్యను అభ్యసించారు. చదువుకున్న బడితో పాటు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే అవకాశం లభించడం ఎంతో గర్వ కారణంగా ఉందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందని, విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చేరి నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు.

ఏసీపీగా నర్సయ్య


అంబటి నర్సయ్య, ఏసీపీ వర్ధన్నపేట, వరంగల్

బండమీద బడి విద్యార్థి పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించి అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం ఏసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రుద్రంగి మండల కేంద్రానికే చెందిన అంబటి నర్సయ్య తన ప్రాథమిక, ఉన్నత, ఇంటర్, పోస్టు గ్రాడ్యుయేషన్ చదువులు అంతా ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే కొనసాగించి పోలీస్ శాఖలో ఎస్సైగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ప్రస్తుతం వరంగల్ జిల్లా వర్ధన్నపేట ఏసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

హైకోర్టు రిటైర్డ్ జడ్జి


ఓలిమినేని నిరంజన్‌రావు

రుద్రంగికి చెందిన ఓలిమినేని నిరంజన్‌రావు రుద్రంగి బండమీది బడి విద్యార్థి. ఇక్కడ ఓనమాలు నేర్చిన ఆయన ఉన్నత చదువులు చదివి హైకోర్టు జడ్జిగా చేసి రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

చదివిన బడిలోనే టీచర్‌గా..


గడప వేణు కుమార్

బండమీది బడిలో ఉన్నత విద్యను అభ్యసించిన రుద్రంగి మండల కేంద్రానికి చెందిన గడప వేణుకుమార్ చదివిన బడిలోనే టీచర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు. చదివిన బడిలోనే విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే అవకాశం లభించడం సంతోషంగా ఉందని తెలిపారు.

రుద్రంగి బడిలో నాణ్యమైన విద్య



రుద్రంగి జెడ్పీ హైస్కూల్‌లో నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందంతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను రుద్రంగి జెడ్పీ హైస్కూల్‌లో చేర్పించాలి.

– సమ్మిరెడ్డి, హెచ్‌ఎం, రుద్రంగి జెడ్పీ హైస్కూల్

ఆధార్ నవీకరణకు మరో ఏడాది పెంపు

- పదేళ్లకోసారి అప్‌డేట్ తప్పనిసరి

కరీంనగర్ అర్బన్: ఆధార్ కార్డుల నవీకరణకు కేంద్రం మరో ఏడాది వరకు గడువు పొడిగించింది. 2026 జూన్ 30 వరకు ఆధార్ కార్డులను నవీకరించుకోవడానికి అవకాశమిచ్చింది. ఆ తర్వాత కూడా నిర్లక్ష్యం చేస్తే కార్డు సస్పెండ్ చేస్తారు. ఒకసారి ఆధార్ కార్డు సస్పెండైతే దానిని పునరుద్ధరించుకోవడానికి వివిధ ధ్రువపత్రాలు పెట్టి మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కార్డుల నవీకరణకు కొందరు ఉత్సాహం చూపుతుండగా అవగాహన లేనివారు మాత్రం దూరంగా ఉంటున్నారు. మరికొందరు మొబైల్ లో మై ఆధార్ యాప్ డౌన్లోడ్ చేసుకుని వివరాలను నవీకరించుకుంటున్నారు.

అన్నింటికీ ఆధారం

పదేళ్ల క్రితం కార్డులు పొందినవారందరూ నవీకరించుకోవాలని యూఐడీఏఐ నుంచి కార్డుదారులకు మొబైల్‌కు సంక్షిప్త సందేశాలు అందుతున్నాయి.


కరీంనగర్‌లోని ఆధార్ సెంటర్

జిల్లావ్యాప్తంగా 2011- 12మధ్య ప్రాంతంలో 9 లక్షల మంది ఆధార్ కార్డులు తీయించారు. అప్పుడు ఊరూరా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ఆధార్ నమోదు చేయించారు. పదేళ్ల చెల్లుబాటు అయ్యేలా నిబంధనలు విధించారు. ప్రతీ పది సంవత్సరాలకు ఒకసారి ఆధార్ ను నవీకరించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆధార్ కార్డు అన్నిటికీ కీలకంగా మారింది. బ్యాంకు ఖాతాలు తెరవడం, విద్యార్థుల ప్రవేశాలు, పింఛన్లు, ఉద్యోగ నియామకాలు, రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబాకర్, సీఎం ఆర్థికసాయం, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలకు కూడా ఆధార్ ను తప్పనిసరి చేశారు. ఆధార్ అప్ డేట్ లేకుంటే కొందరికి రేషన్, పింఛన్లు కూడా ఆగిపోతున్నాయి. ఆధార్ కార్డులు తీసుకున్నప్పటికీ కొందరు అప్డేట్ చేసుకోలేకపోతున్నారు. ఇప్పటికే రెండు మార్లు గడువు పొడిగించిన కేంద్రం మరో ఏడాది వరకు ఆధార్ నవీకరణ గడువు పెంచింది.

ఏమేం కావాలంటే..

ఆధార్‌కార్డు నవీకరణకు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పత్రం తీసుకెళ్లాలి. చదువుకున్నవారు పదోతరగతి మార్కుల మెమో తీసుకెళ్తే సరి. ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, పాస్ పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, మ్యారేజ్ సర్టిఫికెట్ వెంట తీసుకెళ్తే ఆధార్ నవీకరణ పూర్తి చేసుకోవచ్చు. జిల్లాలో పాత జనాభా లెక్కల ప్రకారం 10 లక్షల మంది జనాభా ఉన్నారు. ఇప్పుడు మరో లక్ష వరకు జనాభా పెరిగే అవకాశం ఉంది. వీరికి అనుగుణంగా ఆధార్ కేంద్రాలు పెంచాల్సిన అవసరం ఉంది.

పేదల రక్తం తాగుతున్న బీజేపీ సర్కార్

- కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు

సిరిసిల్లటౌన్: పెంచిన నిత్యవసరాల ధరలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మొగిలి సునీతారావు డిమాండ్ చేశారు. ధరలు తగ్గించాలంటూ మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మహిళా నేతలతో ధర్నా చేపట్టి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిరుపేదల నడ్డి విరిచేలా నిత్యవసర సరుకుల ధరలు పెంచడం సమంజసం కాదన్నారు. బీజేపీ పాలనలో సంక్షేమం కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంతకుముందు జై బాపు.. జై భీమ్.. జై సంవిదాన్.. కార్యక్రమం సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తా నుంచి నేతన్న విగ్రహం వరకు వందలాది మహిళా కార్యకర్తలతో ర్యాలీ తీశారు. సంక్షేమ పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. సిరిసిల్లలో డబుల్‌బెడ్ రూం లబ్ధిదారుల వద్దకు వెళ్లి భూమి పూజ నిర్వహించారు. రేషన్ షాపులో సన్నబియ్యం పంపిణీ చేశారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న సునీతారావు తదితరులు

అనంతరం సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేయడం జరిగిందని, మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, సీనియర్ నాయకురాలు మడుపు శ్రీదేవి, జనరల్ సెక్రటరీ కోడం అరుణ, రోజా, సరిత, బ్లాక్ ప్రెసిడెంట్ రమాదేవి, టౌన్ ప్రెసిడెంట్ స్వరూప, ముసుకు పద్మ, రుక్మిణి, లహరి, హారిక, వనిత, రాజ్యలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


ఏసీబీకి చిక్కిన జెడ్పీ అధికారులు


ఏసీబీకి పట్టుబడ్డ శరత్, వేణుగోపాల్

కరీంనగర్‌క్రైం: జిల్లా పరిషత్‌లో అద్దె వాహనాలకు బిల్లు చెల్లింపు విషయంలో లంచం డిమాండ్ చేసిన ఇద్దరు అధికారులు ఏసీబీ అధికారులకు చిక్కారు. జిల్లా పరిషత్‌లో ఓ వ్యక్తి తన వాహనాన్ని అద్దెకు పెట్టాడు. 10నెలలు బిల్లు ఇవ్వాల్సి ఉండగా కొన్ని రోజుల క్రితం 4నెలల బిల్లు చెల్లించారు. మిగితా 6 నెలల బిల్లు ఇవ్వాలంటే రూ.8వేల లంచం ఇవ్వాలని పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ శరత్, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం సాయంత్రం జిల్లా పరిషత్‌లో డబ్బులు తీసుకుంటుండగా ఇంజినీర్ శరత్, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్‌ను ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.



కొనసాగుతున్న భాగవత సప్తాహం



సిరిసిల్లకల్చరల్: దుర్గా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో భాగవత సప్తాహం కొనసాగుతోంది. పట్టణ శివారులోని కల్యాణ లక్ష్మి గార్డెన్‌లో మంగళవారం పెద్దసంఖ్యలో హాజరైన భక్తులకు ఉద్దేశించి ఫణతుల మేఘరాజ శర్మ పోతన భాగవతంలో ఘట్టాలను వివరించారు. నిర్వాహకులు బచ్చు లలిత, మోహన్, పబ్బ పావని, నాగరాజు, కాసనగొట్టు వసంత, గౌరయ్య, బంధం నాగలక్ష్మి, వెంకటేశం, బాసెట్టి సురేఖ, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

ధర్మపురి: తనకు దొరికిన తులం బంగారం చైన్‌ను పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఓ ఆటో డ్రైవర్. ధర్మపురికి చెందిన నూగూరి నగేష్ ఆటో డ్రైవర్. మంగళవారం స్థానిక బస్టాండ్ సమీపంలో అతడికి తులం బంగారు చైన్ దొరికింది. దానిని ధర్మపురి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్‌కు అందించాడు. అప్పటికే గొలుసు పోయిందని బాధితులు వెదుకుతుండగా వారిని విచారణ చేపట్టిన పోలీసులు వారికి అప్పగించారు. నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ నగేష్‌ను శాలువాతో సన్మానించారు.

సంగీతమే ఆయన ప్రాణం

- రాణిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు
- మూడుసార్లు బంగారు పతకాలు
- 26 ఏళ్లుగా కచేరీలు


పాట పాడుతున్న జగదీశ్వరశర్మ

జగిత్యాలరూరల్: అతడికి చిన్నప్పటి నుంచే చదువుతోపాటు సంగీతం అంటే ఎంతో ఇష్టం. తన సంగీతంతో జాతీయ, రాష్ట్రస్థాయిలో పలువురి మన్ననలు పొంది అవార్డులు కూడా అందుకున్నారు. ధర్మపురికి చెందిన గుండి జగదీశ్వర్‌శర్మ మేడిపల్లి మండలం వల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రేడియో, టీవీ గాయకుడిగా పలు సంగీత కచేరీలు నిర్వహిస్తూ మన్ననలు పొందారు. పలు టీవీ సీరియల్స్‌కు సంగీతం అందించారు. మ్యూజిక్ డైరెక్టర్ కోటి, మాదవపెద్ది సురేశ్, ఆర్పీ



బంగారు నంది అవార్డుతో..

పట్నాయక్‌తో కలిసి పలు సంగీత కచేరీల్లో పాల్గొన్నారు. 26ఏళ్లలో 1,596 కచేరీలు నిర్వహించారు. ఇందులో 120 బెస్ట్ సింగర్ అవార్డులు అందుకున్నారు. దివంగత ఎస్పీ బాలసుబ్రమణ్యం పేరున మూడుసార్లు, ఘంటసాల పేరున రెండుసార్లు అవార్డులు అందుకున్నారు. ఆయన సంగీత సేవలకు ఢిల్లీ యూనివర్సిటీ డాక్టరేట్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందించింది. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి శతకం, వినాయక భక్తి గీతాలు, రాముని భక్తిగీతాలు, ఆంజనేయస్వామి భక్తి గీతాలు పాడి తన సంగీతాన్ని పలువురికి వినిపించారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్రచికిత్స

కరీంనగర్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శ్రావణ్‌కుమార్ అనే యువకుడికి అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో డాక్టర్ దిలీప్‌రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ వారిస్ ఉస్మాని(తాహా) తెలిపారు. ఆసుపత్రిలో మంగళవారం మాట్లాడుతూ.. ‘కరీంనగర్‌కు చెందిన శ్రావణ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్తే కన్నుపై దెబ్బ తగిలిందని కుట్లు వేశారు. కడుపులో తీవ్ర గాయమై, రక్తం లీక్ అవుతుందని తెలపడంతో పలు ఆస్పత్రులకు తీసుకెళ్తే తమతో కాదన్నారు. చివరకు ప్రాణాపాయస్థితిలో మెడికవర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. శ్రావణ్‌కుమార్‌కు సీటీస్కాన్ చేయడంతో కడుపులో బ్లంట్ ఇంజ్యూరీ అబ్డామెన్ (తీవ్ర రక్తస్రావం) అవుతున్నట్లు గుర్తించాం. బైక్ హ్యాండిల్ కడుపులో బలంగా గుచ్చుకోవడంతో రక్తస్రా


మాట్లాడుతున్న వైద్యులు

వంతో పాటు లివర్, ప్రాంకియాస్, స్ప్లీన్ దెబ్బతిన్నాయి. ఆపరేషన్ చేసి లివర్‌కు చికిత్స చేశాం. తప్పని పరిస్థితుల్లో ప్రాంకియాస్ కొంత భాగం, స్ప్లీన్ (ప్లీహం) మొత్తం తొలగించడం జరిగిందని’ అని వెల్లడించారు. ప్రస్తుతం శ్రావణ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి బాగుందని తెలిపారు. మెడికవర్ సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ పాల్గొన్నారు.

విధుల నుంచి అన్యాయంగా తొలగించారు

- గురుకులం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య గురుకులం ఆశ్రమ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించడంతో మంగళవారం పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగారు. పర్మినెంట్ ఉద్యోగులు రావడంతో తమను విధుల నుంచి తొలగించడంతో రోడ్డునపడ్డామని ల్యాబ్ అసిస్టెంట్ నిర్మల, కుకింగ్ మాస్టర్ బాలు, ఏఎన్ఎం సుజాత, మరోకరు ఆవేదన వ్యక్తం చేశారు. తమను తొలగించడాన్ని నిరసిస్తూ పాఠశాల ముందు బైఠాయించారు. 20 ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్న తమను అన్యాయంగా తొలగించారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏకలవ్య మోడల్ పాఠశాలల్లో పని చేస్తున్న 73 మందిని తొలగించగా, అందులో వీరు కూడా ఉన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అన్యాయంగా తొలగించారని గిరిజన గురుకులం నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్ అన్నారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.


కుటుంబ సభ్యులతో గురుకుల పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

ఆందోళన చేస్తున్న వారికి గిరిజన సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై రమాకాంత్ అక్కడికి వెళ్లి పాఠశాల ప్రిన్సిపాల్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో మాట్లాడి శాంతింపజేశారు. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మాట్లాడుతూ, పాఠశాలలో 20ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా తాము విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. ఉన్నఫలంగా తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డునపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వమే ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని కోరారు.

బహ్రెయిన్‌లో 9 మంది అరెస్ట్



ఫిర్యాదు చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

- సాయం కోసం ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించిన కుటుంబ సభ్యులు

జగిత్యాలక్రైం: ఉన్న ఊరిలో ఉపాధి లేక గల్ఫ్ దేశం వెళ్లిన కార్మికులు చేయని తప్పునకు అక్కడ శిక్ష అనుభవిస్తున్నారు. బహ్రెయిన్‌లో ఆల్ మోయ్యాద్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న 9 మంది తెలంగాణ కార్మికులను ఇంధనం దుర్వినియోగం కేసులో ఇటీవల అరెస్ట్ చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన బొమ్మడి సుదర్శన్ బహ్రెయిన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తాడు. ఆయనతోపాటు మరో 8 మందిని ఈనెల 4న అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. వారికి న్యాయ సహాయం అందించాలని సుదర్శన్ కుమారుడు నితిన్ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లోని ప్రవాసి ప్రజావాణిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, గుగ్గిళ్ల రవిగౌడ్, నంగి దేవేందర్‌రెడ్డి, బొజ్జ అమరేందర్‌రెడ్డితో కలిసి వినతిపత్రం సమర్పించారు.

స్టైఫండ్ చెల్లించాలి


ధర్నా చేస్తున్న హౌజ్‌సర్జన్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని ప్రతిమ మెడికల్ కళాశాల హౌజ్‌సర్జన్లు స్టైఫండ్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ప్రభుత్వం ప్రతి హౌజ్‌సర్జన్‌కు నెలకు రూ.25వేల స్టైఫండ్ చెల్లిస్తోందన్నారు. కళాశాల యాజమాన్యం ఎవరికీ స్టైఫండ్ ఇవ్వడం లేదని ఆరోపించారు. స్టైఫండ్ చెల్లించేవరకు ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి దుర్మరణం

కథలాపూర్(వేములవాడ): బైక్ అదుపు తప్పి ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని కలిగోట శివారులో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కట్టలింగంపేటకు చెందిన మారుపాక హరీశ్ (27) ద్విచక్రవాహనంపై తన అత్తగారిల్లయిన భీమారం మండలం రాజలింగంపేటకు వెళ్తున్నాడు. కలిగోట శివారులోకి చేరగానే అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై నవీన్‌కుమార్ పరిశీలించి వివరాలు సేకరించారు. హరీశ్‌కు ఐదేళ్ల క్రితం వివాహమైందని, ఆయన భార్య ప్రస్తుతం గర్భిణి అని గ్రామస్తులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.